

రైతుల కల సాకారం

- పూర్తయిన రామగుండం ఎత్తిపోతల పథకం పనులు
- 13,386 ఎకరాలకు అందనున్న సాగు నీరు
- వచ్చే నెల 3న పథకం ప్రారంభించేందుకు సన్నాహాలు



రామగుండం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రామగుండం నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములను స్థిరీకరించేందుకు ఏడేళ్ల క్రితం చేపట్టిన రామగుండం ఎత్తిపోతల పథకం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ పథకంపై ఆశలు పెంచుకున్న రైతుల కల సాకారం కానున్నది. వచ్చే నెల 3వ తేదీన ఈ పథకాన్ని ఆరంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎస్సారెస్పీ డి-83, 17ఎల్, 27ఎల్ ఉప కాలువల ద్వారా 13,386 ఎకరాల భూములను స్థిరీకరించనున్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, జిల్లా కలెక్టర్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. రామగుండం మండలం ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినప్పటికీ, ఇదే ప్రాంతానికి ఆ ప్రాజెక్టు ద్వారా సాగు నీటిని ఇవ్వక పోవడంతో ఎక్కడో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిపైనే రైతులు ఆధారపడాల్సి వస్తున్నది. అక్కడి నుంచి సక్రమంగా నీళ్ల రాక పంటలు ఎండిపోయి రైతులు నష్టాల పాలయ్యారు. దీనికి పరిష్కారంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రామగుండం ప్రాంత రైతులకు సాగు నీటిని అందించేందుకు ఏడేళ్ల క్రితం చేపట్టిన రామగుండం ఎత్తిపోతల పథకం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి.



పంప్‌హౌస్‌లో బిగించిన మోటార్లు

● నిధుల కొరతతో పనుల్లో ఆలస్యం

రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని పలు గ్రామాల్లో గల సుమారు 13 వేల ఎకరాలకు పైగా భూములకు ఎస్సారెస్పీ డి- 83, 27ఎల్, 17ఎల్ కాలువల ద్వారా సాగు నీరందుతున్నాయి. ఈ భూములు కాలువకు చివరన ఉండడంతో సక్రమంగా నీళ్లు అందక పంటలు ఎండిపోయాయి. ఇదే ప్రాంతంలో గోదావరిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించినప్పటికీ, ఎస్సారెస్పీ భూములను స్థిరీకరించాలని అప్పటి ప్రభుత్వాన్ని ఈ ప్రాంత రైతులు కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానైనా ఈ ప్రాంతానికి సాగు నీటిని అందించాలని కోరినప్పటికీ సాధ్యం కాలేదు. కనీసం ఒక ఎత్తిపోతల పథకం నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సీఎం కేసీఆర్‌కు పలుసార్లు వినతిపత్రాలు ఇచ్చి అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో 2017 డిసెంబర్‌లో 72 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. 69 కోట్ల రూపాయలకు పరిపాలన మంజూరు ఇచ్చారు. ఈ పథకానికి భూమి పూజ చేసేందుకు 2018 ఫిబ్రవరి 27న సీఎం కేసీఆర్ స్వయంగా ముర్మూరు వచ్చారు. హైదరాబాద్ సిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కోసం ముర్మూరు వద్ద

(మిగతా 8వపేజీలో)

నిత్య విద్యార్థిగా ఉండాలి

రామగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వయసుతో సంబంధం లేకుండా నిత్య విద్యార్థిగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని గ్లోబల్ స్పీకర్ వేముకంటి రమేశ్ ఉద్ఘాటించారు. మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'బీటెక్ ఏ రివార్డింగ్ క్యారియర్' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో పాల్గొన్న రమేశ్ కమ్యూనికేషన్, ఎంప్లాయిబిలిటి, సాఫ్ట్ స్కిల్స్, సమయపాలన, మోటివేషన్‌లాంటి అంశాలపై సుదీర్ఘంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, సహాయ అధ్యాపకులు, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

అంతర్గాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం పెద్దపల్లి డీసీపీ పీ కరుణాకర్ తనిఖీ చేశారు. కేసుల నమోదు వివరాలను స్థానిక ఎస్ఐ బోయ వెంకటస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్, రవి, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే

జ్యోతినగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీ పాఠశాలలో సింగరేణి సీఎస్ఆర్ సహకారంతో ముద్రించిన క్యూఆర్ కోడ్ పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టులో క్యూఆర్ కోడ్ ముద్రించిన పుస్తకాలను అందజేస్తున్నావన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఆర్‌జీ.1 జీఎం డి.లలిత్‌కుమార్, రామగుండం ఏసిపి ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఖని ఆర్‌టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా ఆగస్టు 5 నుంచి 28వరకు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. ఆగస్టు 5న కర్ణాటకలోని గాన్కాపూర్‌లోని దత్తాత్రేయ ఆలయానికి రాత్రి 7గంటలకు సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్టు, పెద్దలకు రూ.2,250, పిల్లలకు రూ.1600, 11న మూడు రోజుల యాత్ర బాసర, శిరిడి, త్రయంబకేశ్వర్, శనిశంగనాపూర్ ఘ్రీశ్నేశ్వర ఆలయాలకు సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3200చార్జీలు నిర్ణయించినట్టు తెలిపారు. 17న నాలుగు రోజు యాత్రకు కాణిపాకం, వెల్లూర్ గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి, ఆలంపూర్ జోగులాంబకు పెద్దలకు రూ.5600, పిల్లలకు రూ.4400చార్జి నిర్ణయించినట్టు, 25న ఒక రోజు యాత్ర యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, కొలనుపాక సూపర్‌లగ్జరీ సర్వీస్‌కు పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.800 చార్జీలు నిర్ణయించారు. 28న ఒక్క రోజు యాత్ర ఝూరాసంగం, బీదర్, రేజింతల్ పుణ్యక్షేతాలకు సూపర్ లగ్జరీ సర్వీస్‌కు పెద్దలకు రూ.1600, పిల్లలకు రూ.1250 చార్జి నిర్ణయించినట్టు చెప్పారు. త్వరలోనే రామేశ్వరం, అయోధ్య, కాశీ, పూరి పుణ్యక్షేత్రాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. యాత్రలే కాకుండా 30లేదా అంతకంటే ఎక్కువ మంది భక్తులు బృందంగా ఏర్పడి కోరుకున్న ప్రదేశాలకు బస్సులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వివరాలకు ఫోన్ 7013504982, 7889847927, 9908138036 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కార్మికులకు లేబర్ కార్డులు ఇవ్వాలి



కార్మిక శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న సంఘ నాయకులు

పెద్దపల్లిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భవననిర్మాణ కార్మికుల, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులకు లేబర్‌కార్డులు ఇవ్వాలని బుధవారం కార్మికశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు కార్మికసంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి అసిస్టెంట్ లేబర్ అధికారి హేమలతను తక్షణమే బదిలీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వారికి లేబర్ కార్డులు ఇవ్వడంలో ఇక్కడి అసిస్టెంట్ లేబర్ అధికారి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. లేబర్ కార్డుల ద్వారా రావాల్సిన బెనిఫిట్స్ అందడం లేదన్నారు. హేమలత బదిలీ చేసేవరకు పోరాడుతామని అందుకు కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీ మెంబర్లుగా బొంకూరి కైలాసం, కన్నం లక్ష్మణ్, శంకనపల్లి లక్ష్మణ్, కోటగిరి పాపయ్య, బొంకూరి రాములు, అడ్లూరి ఈశ్వర్, పెర్క రాజేందర్, కత్తెరపాక ఎల్లయ్య, మొండయ్య, క్రాంతికుమార్‌లను ఎన్నుకున్నారు.

ఓదెల ఆలయ చైర్మన్‌గా మొండయ్య



మొండయ్య

ఓదెల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన మొండయ్యను నియమిస్తూ బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. 13 మంది సభ్యులతో ఆలయ కమిటీని ఏర్పాటు చేసింది. డైరెక్టర్లుగా జంగ కొమురయ్య (కొలనూర్), కోడాటి మనోహర్‌రావు (శానగొండ), జీలుక రవీందర్ (రూపునా రాయణపేట), కట్కూరి సమ్మిరెడ్డి (జీలకుంట), కొండ శ్రీనివాస్‌గౌడ్ (పెగడపల్లి), తాళ్లపల్లి శ్రీనివాస్ (కనగర్తి), నాగపూరి రవిగౌడ్ (ఓదెల), తీర్థాల రాజారాం (ఓదెల), ఈరవేణి రవికుమార్ (నాంసానిపల్లి), ఉప్పుల శ్రావణ్ కుమార్ (వెన్నంపల్లి), గంట రమేష్ (హరిపురం),సామల యమున (సుల్తానాబాద్)లు నియామకం అయ్యారు.

ఎన్‌టీపీసీ, సింగరేణి నుంచి నిధులు ఇప్పించండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కందుల సంధ్యారాణి

అంతర్గాం/కోల్ సిటీటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్‌టీపీసీ, సింగరేణికి ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కందుల సంధ్యారాణి, కందుల పోచం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభావిత గ్రామమైన లింగాపూర్‌కు చెందిన ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎన్‌టీపీసీ సంస్థ ద్వారా లింగాపూర్ నుంచి గోదావరి పంప్‌హౌస్ వరకు సీసీరోడ్డు, ఇరువైపులా సైడ్ డ్రైన్లు నిర్మించే విధంగా ఎన్‌టీపీసీ సంస్థకి ఆదేశాలు ఇవ్వాలని, సింగరేణి సంస్థ ద్వారా లింగాపూర్ నుంచి మేడిపల్లి ఓసీపీ-4 వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

గర్భిణీలకు పోషకాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి గర్భిణీకి క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 5 సంవత్సరాలలోపు పిల్లలందరి ఎత్తు, బరువు రెగ్యులర్‌గా చెక్ చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలను కూడా తప్పనిసరిగా చెక్‌చేసి సామ్ (బరువు తక్కువ), మామ్ (ఎత్తు తక్కువ) పిల్లలను గుర్తించాలన్నారు. ప్రతి నెలా ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లల ఎదుగుదల మానిటరింగ్ కోసం షెడ్యూల్ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోషకలోపం ఉన్న పిల్లలకు తప్పనిసరిగా బాలామృతం ప్లస్ సరఫరా చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీల నమోదు 100 శాతం ఉండాలని, మంథని సెక్టార్‌లో 66 గర్భిణుల రిజిస్ట్రేషన్ జరిగితే, సుల్తానాబాద్, గర్రెపల్లి వంటి సెక్టార్‌లలో 170కి పైగా జరుగుతున్నాయని, లోపాలను గుర్తించి పూర్తిస్థాయిలో ప్రతి గర్భిణీ మహిళ అంగన్వాడీ కేంద్రంలో నమోదయ్యేలా చూడాలన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని, ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ జరిగిన ప్రతి గర్భిణీ మహిళ అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ కావాలని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి తక్కువగా వచ్చే గర్భిణులను ట్రాక్ చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల అటెండెన్స్ తక్కువగా ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, అంగన్వాడీ కేంద్రానికి రాకపోతే వారి పోషణ సరిగ్గా ఎలా ఉంటుందని కలెక్టర్ ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రంలో నమోదైన పిల్లల హాజరు వివరాలను రెగ్యులర్‌గా సీడీపీఓ, సూపర్ వైజర్లు రివ్యూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అంగన్వాడి సెంటర్‌లో అవసరమైన పౌష్టికాహారం నిల్వలు, తాగునీటి సరఫరా చెక్ చేసుకోవాలని అన్నారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజూ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి

ఆగస్టు 10 నాటికి జిల్లాలో ప్రతి పంచాయతీ రాజ్ ఏఈ పరిధిలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖపై సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 5 సంవత్సరాల వరకు ఎటువంటి పనులు చేపట్టాల్సిన అవసరం రాకుండా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కోడ్ ఇబ్బంది రాకుండా ముందస్తుగా పనులు గ్రౌండ్ చేసి పెట్టుకోవాలని, ఆగస్టు 10 నాటికి ప్రతి ఏఈ పరిధిలో మంజూరు చేసిన పనులు తప్పనిసరిగా ప్రారంభం కావాలన్నారు. జిల్లాలోని హెల్త్ సెంటర్స్ మరమ్మతు పనులు, సబ్‌సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, సిపిఓ రవీందర్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించుకోవచ్చు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత

పెద్దపల్లి టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా ఎలాంటి కేసులనైనా సులభంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. స్వప్నరాణితో కలిసి కార్యక్రమంలో మాట్లాడారు. భార్యాభర్తలు గొడవపడి కోర్టుల్లో కేసులు ఫైల్ చేయడం, కుటుంబ సమస్యల, ఆస్తి తగాదాల కేసులను పరిష్కరిచ్చుకోవచ్చని తెలిపారు. సదస్సుకు హాజరైన కక్షిదారులు కూడా తమ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మధ్యవర్తిత్వానికి మద్దతుగా సంతకాలు చేసారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్, కార్యదర్శి కోటగిరి శ్రీనివాస్, ప్రభుత్వ న్యాయవాది మార కిషోర్, లోక్ అదాలత్ సభ్యులు కె.శ్రీదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పట్టెం రవీందర్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని మంత్రికి వినతి

కమాన్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన స్వర్ణకుంటకు వెళ్లే దారికి ఫార్మేషన్, మెటల్ రోడ్డు నిర్మించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్, నాయకులు అంబీర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. నిత్యం ఈ రోడ్ల వెంబడి రాజాపూర్, గుండారం గ్రామాల రైతులు, కూలీలు వెళ్తుంటారని తెలిపారు.

ఆగస్టు 15లోపు ప్లాంటేషన్ పూర్తి చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి కాళిందిని

పెద్దపల్లి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 15లోపు ప్లాంటేషన్ పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి కాళిందిని అన్నారు. బుధవారం మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలకు ఇచ్చిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని , ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. దీంతో పాటు మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వాహన డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

● పెద్దపల్లి డీసీపీ కరుణాకర్



ప్రసంగిస్తున్న డీసీపీ కరుణాకర్

కోల్‌సిటీటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియామాలు తప్పకుండా పాటించాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యజమానులు, బస్‌డ్రైవర్లకు బుధవారం స్థానిక అడ్డగుంటపల్లిలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేష్ ప్రసంగించారు. పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు, బస్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు నైపుణ్యం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. పిల్లలను ఎక్కించేప్పుడు, దించేప్పుడు నిర్దేశించిన ప్రదేశాల్లోనే మాత్రమే బస్సులను నిలుపుదల చేయాలన్నారు. డ్రైవర్లు ఓవర్ టేకింగ్ చేయవద్దని, మద్యం సేవించినట్టు, సెల్‌ఫోన్‌లు ఉపయోగించినట్టు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. డ్రైవర్లు ఏ తప్పు చేసినా స్కూల్ యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ సదస్సులో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు, మంథని సీఐ రాజు, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధు, వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, భూమేష్, అనూష, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకటేష్, కమాన్ పూర్ ఎస్ఐ ప్రసాద్, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, మంథని ఎస్ఐ రమేష్, ముత్తారం ఎస్ఐ నరేష్, ప్రిన్సిపల్స్, బస్సుడ్రైవర్లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం


శేఖర్(ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన బొడిగే శేఖర్(60) పట్టణ కారుఅసోసియేషన్ అధ్యక్షుడిగా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా అప్పులు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో తిప్పాపూర్ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి సంతానం లేదు. మృతుడు శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జెన్‌కో ఉద్యోగి ఆత్మహత్య

జూలపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామపరిధిలో గల జెన్‌కో మినీహైడల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న పెద్దపల్లికి చెందిన మేడుదుల రాజన్న(49) అనే జెన్‌కో ఉద్యోగి బుధవారం పవర్‌ప్రాజెక్టులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి పోలీసులు అందించిన వివరాల మేరకు.. కాచాపూర్ గ్రామ శివారులోని జెన్కో పవర్‌ప్రాజెక్టులో జూనియర్‌ప్లాంట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడుదుల రాజన్నకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు 2020లో ప్రేమవివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఉన్నారు. సాయికుమార్ ఎంబీఏ చదవడానికి 2022లో యూకే వెళ్లాడు. అప్పటినుంచి సాయికుమార్ భార్య తల్లిగారి ఇంట్లో ఉంటోంది. యూకే వెళ్లిన భర్త 2024లో తిరిగి ఇంటికి తిరిగి వచ్చినా భార్య ఇంటికి రాలేదు. దీంతో రెండు కుటుంబాల మధ్య పంచా యతీలు జరిగాయి. మనస్థాపానికి గురైన రాజన్న జీవితంపై విరక్తిచెంది తాను పనిచేస్తున్న పవర్‌ప్రాజెక్టులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

సౌదీలో యువకుడి బలవన్మరణం


వినోద్(ఫైల్)

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన సంగెం వినోద్(30) అనేయువకుడు సౌదీలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం జిద్దాలోని ఓకంపెనీలో పనిచేస్తున్న వినోద్ ఈనెల 22న గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది. అయితే ఈ ఘటనపై శవాన్ని మార్చురీలో ఉంచి అక్కడిపోలీసులు విచారణ జరుపు తున్నట్టు సమాచారం. వినోద్‌మృతి వార్తతెలిసి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వినోద్ ఆరునెలల క్రితం సౌదీవెళ్లాడు. కాగా ఆత్మహత్య కారణాలు తెలియరాలేదు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కట్టుకున్న భార్యను కడతేర్చిన వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఫస్ట్‌అడిషనల్‌డిస్ట్రిక్, సెషన్స్‌జడ్జి నారాయణ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని యొకిన్‌పూర్‌కు చెందిన ఎర్ర చంద్రయ్య-గంగరాజు దంపతులు కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మద్యానికి బానిసైన చంద్రయ్య నిత్యం భార్య గంగరాజుతోపాటు అతని కుమారుడు సుధీర్‌ను వేధిస్తూ ఉండేవాడు. 2022అక్టోబర్ 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చంద్రయ్య మద్యం మత్తులో తనభార్య గంగరాజుతో గొడవపడి గొంతునులిమి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం తన భార్య మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని మృతదేహాన్ని మూట కట్టి గ్రామశివారులో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో పడేశాడు. గుర్తు తెలియని మహిళ మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తులో మహిళ మృతదేహం గంగరాజుగా గుర్తించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐలు రాజశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు గణేష్, రాజు, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

దొంగలున్నారు జాగ్రత్త



- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- జిల్లాలో వరుస దొంగతనాలతో ఆందోళన
- వారం రోజుల్లో ఎనిమిది సంఘటనలు

పగలు రెక్కీ.. రాత్రి చోరీ..

దొంగలు గ్రామాల్లో బైకులు, ఇతర వాహనాలపై వివిధ రకాల వ్యాపారాల పేరిట తిరుగుతూ పగటిపూట రెక్కీ నిర్వహిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా వాటిని పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు.

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసు కొని చోరీలకు పాల్పడుతున్నారు. బంగారం, నగదు, వెండి ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఇళ్లకు తాళం వేసి వెళ్లేందుకు జనం జంకుతున్నారు. కొంతమంది జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇటీవల పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల జరిగిన దొంగతనాలు కలవర పెడుతున్నాయి.

ఈ నెల 23న తిమ్మాపూర్ మండలం పోరండ్లలో ఆరు ఇళ్ల తాళాలు పగులగొట్టిన దొంగలు మూడు ఇళ్లలో బంగారం, నగదు, వెండి ఎత్తుకుపోయారు. 27న గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో బీరువాలోని డబ్బులు, బంగారం దొంగిలించుకుపోయారు. 28న మానకొండూర్ మండలం లలితాపూర్‌లో ఓ ఇంటిలో చొరబడి బంగారం, నగదు, విలువైన సొమ్ములు చోరీ చేశారు. వారం రోజుల వ్యవధిలో ఎనిమిది ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలు మరుసటి రోజు ఉదయం ఊరు నుంచి వచ్చి చూసే సరికి ఇళ్ల తాళాలు పగు లగొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించి కేసులు నమోదు చేశారు.

అడ్డుకోలేకపోతున్న నిఘా

ఓ వైపు బ్లూకోల్ట్స్ పోలీసుల గస్తీ, రాత్రి పూట పోలీసు అధికారుల పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిఘా ఇవి ఏవీ దొంగతనాలను అడ్డుకోలేకపోతున్నాయి. ఇళ్లకు తాళం వేసిన సందర్భంలో బంగారం, వెండి, నగదు వంటి విలువైనవి లాకర్లలో భద్రపరచుకోవాలని లేదంటే వెంటతీసుకెళ్లాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రజలు మండల కేంద్రాల్లో దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లడం, లాకర్లలో విలువైన సొమ్ములు భద్రపరచుకోవడం భారంగా భావిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ పనులతో బిజీగా ఉండి ఇళ్లలోనే సొమ్ములు భద్రపరచుకుంటున్నారు. ముఖ్యంగా బంగారం ధర పెరగడం దొంగలకు వరంగా మారింది. ప్రతీ ఇంటా కాస్తోకూస్తో బంగారం ఉంటుంది. దీంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో పోలీసుల గస్తీ, ప్రజల భద్రత పై చర్చ నడుస్తున్నది. పోలీసుల గస్తీతో పాటు గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ఇందుకు పోలీసులు కూడా అనుమతి ఇస్తామంటున్నారు.

ఆనవాళ్లు చిక్కకుండా చోరీలు

ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉంచుతూ గొళ్లాలను చాకచక్యంగా తొలగించి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. దొంగలు వారి ఆచూకీ సీసీ కెమెరాలకు చిక్కకుండా ముఖానికి మాస్కులు, వేలిముద్రలు లభించకుండా చేతులకు గ్లౌస్‌లు ధరిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో కొంతకాలం కిందట జరిగిన కొన్ని చోరీ ఘటనల్లో దొంగలు వాకీటాకీలతో మాట్లాడుకున్నట్లు వెల్లడైంది. బైకులను చాలాదూరంలో వదిలిపెట్టి రావడం, చోరీ చేసిన వాహనాలతోనే గ్రామాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడడం వంటివాటితో వారిని గుర్తించడం, పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారిందంటున్నారు. కొన్ని సంఘటనల్లో తాళం పగులగొట్టే సందర్భంగా శబ్దం పక్కింటికి వినపడకుండా టవల్, బెడ్ షీట్‌లు చుడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



చోరీల నియంత్రణకు పోలీసుల సూచనలు

- వీలైనంత వరకు ఇంటి లోపలే నిద్రించేలా చూసుకోవాలి.
- నగలు, డబ్బు, విలువైన వస్తువులు సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లుగుమ్మం వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికను గుర్తించే సెన్సార్ లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- గేట్లు రాత్రిపూట మూసి ఉన్నట్లు నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళంవేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది. వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- ఇళ్ల పరిసరాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని, ఆస్తిని కాపాడుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని రాజాపూర్ గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి మల్లారెడ్డి భార్యతో కలిసి హనుమకొండలోని తనకొడుకు విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి సోమవారం సాయంత్రం వెళ్లారు. బుధవారం రాజాపూర్‌లోని తనఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని తులం బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, 10పట్టుచీరలు, రూ.40వేలనగదు దొంగలించినట్లు తెలిపాడు. విజయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

రాచర్లగొల్లపల్లిలో బైక్ చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రహదారిపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారు.బాధితుడి కథనం మేరకు.. గంబీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యక్తి వేణుకుమార్ తన బైక్‌పై రాచర్లగొల్లపల్లి గ్రామానికి చేరుకుని స్థానిక మార్కండేయ ఆలయం వద్ద వాహనాన్ని నిలిపాడు. సమీపంలోని పరిచయం ఉన్న వ్యక్తులకు వద్ద వెళ్లి వచ్చి చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు వేణుకుమార్ పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి మృతి


సూర్య(ఫైల్)

గొల్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి సూర్య(17) అనే విద్యార్థి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గొల్లపల్లి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపినవివరాల ప్రకారం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి రాజయ్య కుమారుడు సూర్యను ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అక్కడ చదువు కోవడం ఇష్టంలేక ఇంటికి తిరిగి వచ్చేశాడు. తల్లి దండ్రులు మందలించేసరికి మనస్థాపానికి గురైన సూర్య ఈనెల 25న క్రిమి సంహారక మందుతాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా బుధవారం మరణించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ్రయం కోరి.. హత్యాయత్నం

- వృద్ధురాలి గొంతుకోసిన మహిళ
- ఇంట్లో ఉన్న బంగారం, నగదుతో పరార్
- ఆకునూర్ గ్రామంలో కలకలం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల

సైదాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నమ్మి ఆశ్రయం ఇస్తే గొంతుకోసి నగలు, డబ్బుతో ఉడాయించింది ఓ మహిళ. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. కరీం నగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన రావుల ప్రమీల అనే వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆకునూర్ గ్రామంలోని తన ఇంటిలో ప్రమీల ఒక్కతే ఉంటోంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం అదేగ్రామానికి చెందిన మిట్టపల్లిస్వరూప అనే మహిళ తనను తనభర్త కొడుతున్నాడని చెప్పి ప్రమీల ఇంటికి వచ్చింది. ఇంటికి వెళ్తే తనభర్త రాత్రి కొడతాడని, ఇక్కడే మీ ఇంట్లోనే రాత్రి పడుకుంటానని ఆశ్రయం ఇవ్వాలని కోరింది. ప్రమీల మొదట ఒప్పుకోలేదు. కానీస్వరూప మాయ మాటలు చెప్పి ప్రమీలను ఒప్పించింది. ఆ రాత్రి స్వరూప, ప్రమీలఇంట్లోనే పడుకుంది. అర్ధరాత్రి ప్రమీలనిద్రలో ఉన్న సమయంలో స్వరూప, ప్రమీలమీద కూర్చొని గొంతునొక్కి చంపేస్తానని బెదిరించింది. నగలు, డబ్బులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుంది. అనంతరం స్వరూప కత్తితో ప్రమీల గొంతుకోసింది. ప్రమీల స్పృహ కోల్పోవడంతో మృతిచెందిందని భావించి నగలు, డబ్బులు తీసుకొని ఇంటితలుపులు బిగించి బయట తాళంవేసి పారిపోయింది. ప్రమీలకు కొంతసేపటి తరువాత మెలకువ రావడంతో తనకొడుకుకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. వెంటనే కొడుకు, ఇతర కుటుంబసభ్యులు వచ్చితాళం పగులగొట్టి ప్రమీలను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రమీల ఆరోగ్యంనిలకడగా ఉన్నట్లుకుటుంబసభ్యులు తెలిపారు. నాలుగుతులాల బంగారు నగలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలు ప్రమీల కుమారుడు రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సన్నాలకు బోనస్ డబ్బులు చెల్లించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించి విక్రయించిన సన్నాలకు ప్రభుత్వం బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని సిబ్బంది చేరుకుని నిరసనకారులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. అతి కష్టం మీద నాయకులను అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సన్న విక్రయించి నాలుగు నెలలు గడుస్తున్న ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించి అన్నదాతలకు మోసగించిందని ఆరోపించారు. నాలుగు నెలలుగా రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అన్నదాతలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, లక్ష్మణ్, కిరణ్‌నాయక్, ఆంజనేయులు, బాపురెడ్డి, రాజిరెడ్డి, రంజిత్‌కుమార్, బాలగౌడ్, రవినాయక్, పర్శరాములు, బాలయ్య, రవీందర్, సత్యంరెడ్డి, బాలకృష్ణ, తిరుపతి, ప్రకాశ్, జవహర్, చరణ్‌గౌడ్, నవీన్, సాగర్, పూర్ణిమ, లహరి, స్రవంతి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ మృతికి కారకులను అరెస్టు చేయాలి


మానవహక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట శ్రావణ్‌కుమార్ తండ్రి, కుటుంబ సభ్యులు

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చొప్పదండిలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న శ్రావణ్‌కుమార్ కేసులో కారకులను అరెస్టుచేయాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మహిళారాణా సీఐశ్రీలత, శ్రావణకుమార్ భార్య నీలిమ, ఆమె తల్లి వినోద, ప్రసన్నకుమార్, ప్రవీణ్ కుమార్, నవీన్‌కుమార్, మధుకుమార్‌ను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని బుధవారం మానవహక్కుల కమిషన్‌కు ఆశ్రయించారు. ఈకేసులో విచారణ అధికారులను మార్చాలని, నిందితులను వెంటనేఅరెస్టుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని శ్రావణకుమార్ తండ్రి నర్సింగం, కుటుంబ సభ్యులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిర గ్రామ చిట్టివాగునుంచి నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ సుజాత బుధవారం తెలిపారు. ఇసుక రవాణాకు మధ్యాహ్నం రెండుగంటల వరకు అనుమతిచ్చామని, సమయం దాటిపోయినా తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్‌ఐ శ్రవణ్, సిబ్బంది మాటువేసి వాహనాలను స్వాధీన పర్చుకున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామని తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కామారెడ్డి జిల్లామాచారెడ్డి నుంచి మండలంలోని రాచర్లబొప్పాపూర్‌వైపు మట్టిని రవాణా చేస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి అనుమతి పత్రాలను పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను స్వాధీనపర్చుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. మాచారెడ్డి మండలం భవానీపేట గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కరెయ్యగారి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.


ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణచేస్తూ మూడురోజుల కిందట కరీంనగర్‌రూరల్ పోలీసులకు పట్టుబడినకేసులో నిందితులను బుధవారం బైండోవర్‌చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నగునూర్‌కుచెందిన బుర్రగాళ్ల మహేష్, సూర అశోక్‌ను తహసీల్దార్‌ఎదుట హాజరుపరచినట్లు, లక్ష రూపాయల జరిమానా లేదా 6నెలల జైలు శిక్ష విధించేట్లుగా బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా లేదా మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ పెద్దపల్లి డిస్ట్రిక్ట్ సెషన్ కోర్టు జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పినట్లు కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ షాదుల్లాబాబా బుధవారం తెలిపారు. సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన కంకణాల శ్రీనివాస్, రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన సందనవేని లక్ష్మణ్ గతంలో విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడ్డారని. వారికి రూ.6,482, రూ.13,727 జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.

హెచ్‌టీ సర్వీసుల కోసం సింగిల్ విండో వ్యవస్థ



అందుబాటులోకి ఆన్‌లైన్ దరఖాస్తు విధానం

గణేశ్‌నగర్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేసేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సింగిల్ విండో వ్యవస్థ అమలు చేస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌టీ, 11కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు కోసం సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెచ్‌టీ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసింది.

● **దరఖాస్తు ఇలా..**


హెచ్‌టీ సర్వీసు కోసం వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో సంప్రదించాలి. కొత్త అప్లికేషన్ నంబరు(యూఐడీ) ఉత్పన్నమవుతుంది. దరఖాస్తులు సమర్పించిన అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం డ్యాష్ బోర్డులో కనిపిస్తాయి. కమర్షియల్ ఏడీఈగా పనిచేసే అధికారి ప్రతీ రోజు డ్యాష్ బోర్డును పరిశీలిస్తారు.

● **పరిశీలనకు ప్రత్యేక ఏర్పాట్లు**

వినియోగదారుల దరఖాస్తుల పరిశీలనకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసుల దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో, 33కేవీ ఆపై సర్వీసుల దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయంలోని కమర్షియల్ ఏడీఈలు పర్యవేక్షిస్తారు. అనంతరం ఎస్టిమేట్ వేసేందుకు దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపిస్తారు. కమర్షియల్ ఏడీ, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రాంతాన్ని పరిశీలిస్తారు. ఆ తర్వాత అనుమతి కోసం దరఖాస్తులను వరంగల్‌లోని కార్పొరేట్ కార్యాలయ అధికారులకు పంపిస్తారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసు దరఖాస్తులను పరిశీలించి అవకాశం ఉంటే రెండు రోజుల్లోనే అప్‌లోడ్ చేస్తారు. అభ్యంతరాలు ఉటే సదరు వినియోగదారుడికి సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) రూపంలో సూచనలు పంపిస్తారు. 33కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసులకు కావాల్సిన మౌలిక వసుతుల ఏర్పాటుకు పొందుపరిచిన సమయానుగుణంగా మంజూరు చేస్తారు. దరఖాస్తు దారులు సైతం కార్యాలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తును పరిశీలించుకునే అవకాశం ఉంది.

వినియోగదారులకు మేలు

మేక రమేష్ బాబు, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్



వినియోగదారులకు మేలు చేసేందుకు హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నాం. పారదర్శకతతోపాటు సర్వీసు మంజూరు వేగవంతమవుతుంది. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఇరువర్గాలపై కేసు నమోదు

సుల్తానాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ పోలీసులు తెలిపారు. మండలంలోని అల్లిపూర్ గ్రామంలో ఓ భూవివాదంలో ఇరువర్గాలు గొడవపడుతుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోర్టు సిబ్బంది ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ దుర్గాదాస్, కానిస్టేబుళ్లు మునీందర్, సదానందంలు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను సముదా యించారు.

అయినా వారు వినకపోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అనంతరం ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ పీవీ కరుణాకర్ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఎరుకొండ వినోద్ అనే వ్యక్తి పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. ఏఎస్సై కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐశ్రావణ్ కుమార్ కేసు కేసు నమోదు చేశారు.

భూసమస్య పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కి నిరసన


సెల్‌ఫోన్ టవర్‌పై కనుకయ్య

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన పందుల కనకయ్య తన భూసమస్య పరిష్కరించాలని కోరుతూ సెల్‌ఫోన్ టవర్ ఎక్కి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కనుకయ్యకు, అతడి కుటుంబ సభ్యులకు మధ్య భూసమయ్య నెలకొంది. సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొంటూ నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దలింగాపూర్ గ్రామానికి చేరుకొని కనుకయ్యకు నచ్చజెప్పడంతో కిందికి వచ్చాడు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జడ్జి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లోపట్టుబడిన 12మందిని హుజూరాబాద్ స్పెషల్‌జుడిషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ముందు హాజరుపరచగా రూ.15వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రేమ వివాహం వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య



కోరుట్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం వద్దన్నందుకు యూసుఫ్‌నగర్‌లో బావు వినయ్ (28) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం బావు వినయ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఆరు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గల్ఫ్ దేశం నుంచి వస్తున్న విషయం కూడా తల్లి సునీతకు తెలపకపోవడంతో ఎందుకు ఇంత తొందరగా వచ్చావని అడిగింది. వినయ్ తాను ప్రేమించిన అమ్మాయితో వివాహం చేయాలని కోరాడు. ఇదివరకే అక్క ప్రేమ వివాహం చేసుకుందని, నువ్వు అలా చేయ వద్దని తల్లి చెప్పడంతో మనస్తాపానికి గురైె వినయ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

ముత్తారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డలో తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం చింతలగూడ గ్రామానికి చెందిన కొమిర భీమయ్య తన భార్య రేణుక (30), కొడుకు నాలుగు సంవత్సరాలు మహేందర్‌తో కలిసి మండల కేంద్రంలోని కాసర్లగడ్డలోని స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నారు. భీమయ్య రోజువారీగా ఈ నెల 15న ఉదయం 7గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 8 గంటల సమయానికి ఇంటికి వచ్చాడు. భార్య రేణుక, కొడుకు మహేందర్ కనపడకపోవడంతో చుటుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

ఫేస్ రికగ్నిషన్‌తో పెన్షన్



- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- ప్రత్యేక యాప్‌పై బీపీఎంలకు శిక్షణ పూర్తి
- నూతన విధానంలో పింఛన్ల పంపిణీ షురూ

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఫేస్ రికగ్నిషన్ అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. బయోమెట్రిక్ విధానం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడంతో పాటు సులభంగా, వేగంగా పెన్షన్ అందించేందుకు ఈ విధానం తోడ్పడనుంది. ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు. ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి పింఛన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. దీని కోసం పోస్టాఫీస్‌ల బీపీఎంలకు ఫేస్ రికగ్నిషన్ యాప్ అప్‌లోడ్ చేసిన సెల్‌ఫోన్లు అందజేయనుంది. జూలై నుంచి ఫేస్ రికగ్నిషన్ విధానం ద్వారా పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు.

వేలిముద్రలతో ఇబ్బందులు..

పింఛన్ పొందాలంటే కచ్చితంగా పోస్టాఫీసు లకు వెళ్లి ఆయా అధికారుల వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. అయితే వృద్ధులకు వేళ్లపై ముద్రలు చెరిగిపోయి స్కాన్ కాకపోవడంతో వారు పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోం ది. మరోవైపు ఐరిష్‌లో కూడా ఒక్కోసారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాంటి వారు మండల, వార్డు అధికారులు ప్రత్యేకంగా రాసిచ్చిన పత్రం ద్వారా పింఛన్లు పొందుతు న్నారు. వృద్ధుల్లో కొందరు రోగాల బారిన పడి ఇంటికే పరిమిత మైన సమయంలో పింఛన్లు పొందలేకపోతున్నారు.

బీపీఎంలకు పూర్తయిన శిక్షణ..

పింఛన్ల పంపిణీలో ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని ప్రభు త్వం అమలు చేయబోతున్న నేపథ్యంలో బీపీఎల కు శిక్షణ పూర్తి చేశారు. జిల్లాలోని బ్రాంచి పోస్టు మాస్టర్ల కు (బీపీఎం) ఫేస్ రికగ్నిషన్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన సెల్ ఫోన్లను అందజేయనుంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో బీపీఎంలకు సెల్‌ఫోన్లు ఇవ్వడానికి అనుగుణంగా ప్రభుత్వానికి వివ రాలు పంపారు. సాధ్యమైనంత తొందరలో సెల్ ఫోన్లు పంపిణీ చేసి బీపీఎంలు యాప్‌ను ఉపయోగించి పింఛ న్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బీపీ ఎంల వద్ద ఉన్న వ్యక్తిగత సెల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పింఛన్లు అందిస్తున్నారు.

ఇబ్బందులు దూరం..

ఇప్పటి వరకు బయోమెట్రిక్ ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేది. పెన్షన్ పొందాలంటే పోస్టాఫీసుకు వెళ్లి అక్కడ బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. ఈ క్రమంలో లబ్ధిదారుల్లో అత్యధికులు వృద్ధులు కావడంతో వేలి ముద్రలు స్కాన్ కాకపోవడంతో వారు పెన్షన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం ద్వారా బయోమెట్రిక్ ఇబ్బందులు దూరం కానున్నాయి. ఆధార్ ఫొటోతో అనుసంధానమైన లబ్ధిదారుల వివరాలు స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీయగానే చెల్లింపు వివరాలు వస్తాయి. వెంటనే పెన్షన్ డబ్బులు పొందేందుకు ఆస్కారం ఉంది. జగిత్యాల జిల్లాలో 2,26,066 మంది పింఛన్ దారులు ఉన్నారు.

పింఛన్లు సులభంగా అందేలా..

బయోమెట్రిక్ విధానంలో పింఛన్లు ఇవ్వడంలో తలెత్తుతున్న సమస్యలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకొస్తోంది. ప్రభుత్వం అందజేసే సెల్‌ఫోన్లలో బీపీఎంలు పింఛన్‌దారుల పేర్లు, వివరాలను అప్‌లోడ్ చేస్తారు. యాప్ ద్వారా ఫొటో తీసిన వెంటనే పింఛన్ దారుడి వివరాలు వస్తాయి. వారికి పింఛన్ చెల్లించినట్లు నమోదు చేసి పింఛన్ అందజేస్తారు. ఇక నడవలేని వారు, వివిధ రోగాలతో మంచాలకే పరిమితమైన వారికి చివరి రోజు ఇళ్లకు వెళ్లి ఫొటో తీసి పింఛన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారుడికి సులభంగా పింఛన్ అందనుంది.

పకడ్బందీగా అమలు : రఘువరన్, డీఆర్‌డీవో, జగిత్యాల

పెన్షన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టి మరింత పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకువచ్చింది. అధికారులకు, బీపీఎంలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తయింది. పూర్తి స్థాయిలో స్మార్ట్ ఫోన్లను అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అమలులోకి తీసుకు వచ్చాం.





రాయికల్‌లో యాప్‌లో పెన్షనర్ల వివరాలు నమోదు చేసి, పెన్షన్ అందిస్తున్న డీఆర్‌డీవో రఘువరన్

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

ప్రాజెక్టులోకి 11,990 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు తగ్గింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు 15,270 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రం వరకు 11,990 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 38.151 టీఎంసీల నీరు ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.128 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.284 టీఎంసీల నీరును వదిలిపెట్టారు. ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎలాంటి ఎంట్రెన్స్ పరీక్ష లేకుండానే ప్రవేశం పొంద వచ్చని, నవోదయ వెబ్‌సైట్‌లో ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఆగస్టు 10లోగా నవోదయ విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అధిక సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్

గణేశ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల జనాభా దామాషా ప్రకారం రానున్న స్థానిక ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ముదిరాజుల జనాభా 14.6 శాతం ఉందని, అధికారాల్లో వారి ప్రాతినిధ్యం లేదని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ముది రాజ్‌లకు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మారుస్తామని ప్రకటించినా మాటలకే పరిమితమైందన్నారు. బీజేపీలో సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వక పోవడం ముదిరాజులపై వివక్షకు నిదర్శనమన్నారు. అధిక సంఖ్యలో ఉండే ముదిరాజ్‌లు రాజకీయంగా చిన్నచూపునకు గురవుతున్నార న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను పట్టించుకోలేదని అందుకే గుణపాఠం చెప్పామని అన్నారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే అసెంబ్లీ ముట్టడికి వెనకాడమని హెచ్చరించారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సిద్ధిసంపత్‌కు నియామక పత్రం అందజేశారు. సమావేశంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దమ్మన్నపేట విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డు

విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు గుర్తింపు

గంభీరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సుప్రియ, శ్రీచైత్ర, మధుప్రియలు ఢిల్లీలో బుధవారం జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈక్రమంలో ఈ నెల 27న ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. వార్షిక జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ 2020) కార్యాచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, స్వతంత్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఉన్నత విద్యా సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యా విధానం కొత్త మార్గదర్శకాలను సృష్టిస్తోందని, ఇలాంటి ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ అభయ్‌జేర్, ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలన్‌గోవన్ చేతులు మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ఢిల్లీలో ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

హోరాహోరీగా ఖోఖో పోటీలు

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ రీజియన్ ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. దక్షిణ భారతదేశంలోని 77నవోదయ విద్యాలయాల నుంచి 560మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. బుధవారం జరిగిన పోటీల్లో పలు జట్లు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరాయి. ఫైనల్ పోటీలు గురువారం జరుగుతాయని, గెలుపొందిన జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతాయని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు.

రిటైర్డు ఏఎస్సై విజయ్‌కుమార్‌ను సన్మానించిన ఇంటెలిజెన్స్ డీజీ

పెద్దపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందిన ఇంటెలిజెన్స్ ఏఎస్సై ఎడ్ల విజయ్‌కుమార్‌ను రాష్ట్ర ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుజాత దంపతులను డీజీ సన్మానించారు. ఈ సందర్భంగా డీజీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు పెద్దపల్లి జిల్లాలో విజయ్‌కుమార్ అకుంఠిత దీక్ష, అంకితభావంతో ఇంటిలిజెన్స్ విభాగంలో తన సేవలను అందించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మిగతావాళ్లు పనిచేయాలన్నారు. విజయ్‌కుమార్ ఆయురారోగ్యాలతో శేష జీవితం గడపాలని డీజీ ఆకాంక్షించారు.



రిటైర్డు ఏఎస్సై ఎడ్ల విజయ్ కుమార్‌ను సన్మానించిన అధికారులు

అభినవ పూలే రాహుల్‌గాంధీ..

- కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జన గణనతో పాటు కులగణన చేపట్టాలి
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు తరలిరావాలి
- పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో ముందుకు వెళుతున్న రాహుల్‌గాంధీ అభినవ పూలే అని, ఆయనకు అందరం మద్దతివ్వాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చిత్రపటానికి హనుమంతరావు, జిల్లా నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కులగణన జరగలేదన్నారు. పారమెంట్ ఓబీసీ కన్వీనర్‌గా ప్రధాని మోదీని మూడు సార్లు కలిశానని, బీసీ జనాభా ఎక్కువగా ఉందని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఇవ్వాలని కోరినా మోదీ పట్టించు కోలేదన్నారు.

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజలను నేరుగా కలిశాడని, అప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలని భావించారన్నారు. ఆయన ఆలోచనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో బిల్లు పాస్ చేయించి ఆర్డినెన్స్ తీశారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆర్డినెన్స్ జరగదంటే మరొకరు ముస్లింలకు రిజర్వేషన్లను ఒప్పు కోమనడం విడ్డూరంగా ఉందని, ముస్లింలలో కూడా పేదవారు ఉన్నా రని, ఉత్తర ప్రదేశ్‌లో 5శాతం ముస్లింలకు రిజర్వేషన్లు, ఇస్తున్నారని తెలంగాణ ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టాలని, దేశ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆగస్టు 11, 12, 13 తేదిలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్నామని, ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీకి మద్దనిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి 21 బిందెలతో క్షీరాభిషేకం చేశామన్నారు.

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం సంస్థ పక్కన మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కోసం భూమి పూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు తన సహాయంగా రూ. లక్ష విరాళంను టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్‌కు అందించారు. విరాళం అందించిన హనుమంతరావుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పక్షాన టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొప్ప దేవ య్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంగళ అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హనుమంతరావు

సైబర్ క్రైం ముఠా పట్టివేత

- ప్రత్యేక పరికరంతో ప్రతీరోజు 12 వేల ఫోన్‌కాల్స్
- ఆంధ్రప్రదేశ్ నుంచి 250 సిమ్‌ల కొనుగోలు

మంచిర్యాలక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యా ల జిల్లా జన్నారంలో భారీ సైబర్ క్రైంకు పాల్పడుతున్న ముఠాలోని నిందితులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల, రామగుండం పోలీసు కమిషనర్, టీజీసీఎస్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ రామగుండం పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి సైబర్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ సెంటర్‌ను పట్టుకున్నట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాండ్రపు కామేశ్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బాపు బాపయ్య, బాపు మధూకర్, జన్నారం మండలం కిష్టాపూర్‌కు చెందిన బొట్ల రాజేశ్, ఆంధ్రప్రదేశ్‌కు వేదాంతపూర గ్రామానికి చెందిన సాయిక్రిష్ణ అలియాస్ జాక్ కలిసి మంచిర్యాల జిల్లా జన్నారంలో ఒక ప్రత్యేక డివైజ్ ద్వారా 250 సిమ్‌లతో ప్రత్యేక సెటప్‌ను బోడ ప్రభాకర్ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. 45 రోజుల నుంచి రోజుకు 12వేల మందికి చొప్పున కాల్స్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. ఈ సిమ్‌లను ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు చేశారు. జాక్ అనే వ్యక్తి దీనిలో ప్రదాన నిందితుడు. కాంబో డియాలో ఉంటున్న జాక్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కామేశ్‌తో పరిచయం చేసుకొన్నారు.

సైబర్ క్రైం కోసం ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రత్యేక సెటప్‌లో సుమారు 260 సిమ్‌కార్డులు, యుఎస్‌బీ కేబుల్, డీలింగ్ పోర్టర్‌లు ఒకే సమయంలో 200 సిమ్‌లను ఆపరేటింగ్ చేసే డివైజ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనినుంచి పలువురికి కాల్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. పూర్తి దర్యాప్తు అనంతరం సైబర్‌క్రైంకు ఎంత మంది బాధితులు ఉన్నారనే విషయాన్ని వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు. వారి అకౌంట్లు పూర్తి దర్యాప్తు అనంతరం ఎంత మేరకు మోసం జరిగిందనే విషయాన్ని వెల్లడిస్తామన్నారు. ఒకే టవర్ నుంచి వేల కాల్స్ వెళ్లడం వల్ల టెలీ కమ్యూనికేషన్ అధికారులు రామగుండం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఆపరేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణారెడ్డి, సీఐ రమణమూర్తి, టెలీకమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ అనురాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్ఎడ్‌లో మిగిలిన సీట్లకు మరోవిడత ప్రవేశాలు

డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్/ పెద్దపల్లి కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కళాశాలల్లో డీఎల్ఎడ్ కోర్సులో మిగిలిపోయిన సీట్లకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం అదనపు సీట్లకు గాను డీఈఈసెట్-2025 ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులకు మరో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కింద ప్రవేశాలు కోరే అభ్యర్థులు ఈనెల 31నుంచి ఆగస్టు2 వరకు ఆన్‌లైన్ ద్వారా డీఈఈసెట్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ఈడబ్ల్యూ ఎస్ అభ్యర్థులు, ఇప్పటివరకు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోని అభ్యర్థులు వచ్చేనెల ఆగస్టు3నుంచి 5వరకు సంబంధిత డైట్‌లలో సర్టిఫి కేట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు కూడా ప్రవేశం పొందనివారు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, స్లైడింగ్ కోరు అభ్యర్థులు ఆగస్టు6,7 తేదీల్లో సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తివివరాలకు డీసెట్ 2025 వెబ్ సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

ఆత్మీయ భరోసాకు మోక్షమెప్పుడో..?

- ఎంపిక గ్రామంలో మొదటి విడత చెల్లింపు
- రెండో విడత ఊసే లేదు
- మిగతా గ్రామాల్లో ఎదురుచూపులు

కరీంనగర్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో ఒక విడత చెల్లించగా మిగతా గ్రామాల్లో ఊసే ఎత్తడం లేదని లబ్ధిదారులు వాపోతు న్నారు. ఉపాధిహామీ కూలీలు, భూమి లేని రైతులకు చేయూత నందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరం చివరలో ప్రారంభించింది. ఈ ఏడాది జనవరి 26న జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసే భూమి లేని వారిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో కరీంనగర్ రూరల్ మండలంలో ఆయా గ్రామాల్లో 1,155 మంది కూలీలను ఎంపిక చేశారు.

ఇందులో పైలట్ ప్రాజెక్టు కింద బహదూర్‌ఖాన్ పేటను ఎంపిక చేయగా గ్రామానికి చెందిన 17 మంది లబ్ధి దారుల్లో వివిధ కారణాలతో ఆరుగురిని తొలగించారు. మిగతా 11 మందికి ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించనుండగా మొదటి విడతలో 6వేలను ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత ఆరు వేలను ఆర్థిక సంవత్సరం ముగిసినా జమ చేయలేదు. జూలైలో రెండో విడత డబ్బులు పడాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేక పోవడంతో ఆత్మీయ భరోసా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఆత్మీయ భరోసా అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పైలట్ గ్రామాలకే పరిమితం చేస్తుండడంపై మిగతా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, పైలట్ ప్రాజెక్టు గ్రామాలతోపాటు ఎంపికైన వారందరికీ పథకం అమలు చేయాలని కోరుతున్నారు.



రైతుల కల సాకారం

(5వ పేజీ తరువాయి)

పంప్‌హౌస్‌ను నిర్మించారు. ప్రాజెక్టు నుంచి ఈ పంప్‌హౌస్ వరకు గల అప్రోచ్ కాలువకు ఎడమ వైపున 300 మీటర్ల దూరంలో రామగుండం ఎత్తిపోతల పథకానికి పంప్‌హౌస్ నిర్మించి అక్కడి నుంచి 5.5 కిలోమీటర్ల దూరం వరకు పైప్‌లైన్ వేసి 27ఎల్ కాలువకు లింకు చేయాలని, అప్రోచ్ కాలువకు కుడి వైపున మరో పంప్‌హౌస్ నిర్మించి పైపులైన్ ద్వారా 17ఎల్ కాలువకు లింకు చేయాలని అంచనాలు రూపొందించారు. ఈ మేరకు పథకానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించినప్పటికీ, నిధుల కొరత వల్ల ఆలస్యమైంది. అర్థాంతరంగా వదిలేసిన పనులను 2018లో గెలుపొందిన కోరుకంటి చందర్ మొదలు పెట్టించినప్పటికీ, 2023 ఎన్నికల నాటికి కూడా పూర్తి కాలేదు. ఆ ఎన్నికల్లో గెలుపొందిన రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ మిగిలిన పెండింగు పనులతో పాటు ఎలక్ట్రికల్ ప్యానల్ పనులు, అప్రోచ్ కాలువ పనులు, సబ్ స్టేషన్ నిర్మాణ, తదితర పనులన్నింటినీ పూర్తి చేయించారు. వచ్చే నెల 3వ తేదీన రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ఆరంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ వచ్చే అవకాశాలున్నాయి. ఈ పథకం ఆరంభం అయిన తర్వాత ఈ వానాకాలం సీజన్‌కు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు డీ-83, 17 ఎల్, 27 ఎల్ కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయనున్నారు. ఈ సీజన్ నుంచి ఎస్సారెస్పీ నీటి సరఫరాతో అవసరం లేకుండానే రెండు పంటలకు పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని కొన్ని భూములకు సాగు నీరందనున్నాయి. ప్రస్తుతం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 11.54 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పథకం ఆరంభం అయిన తర్వాత ప్రాజెక్టు నుంచి రామగుండం ఎత్తిపోతల పథకం ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయనున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



సభాస్థలిని కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. ఆగస్టు 3న అంతర్గాం మండల కేంద్రంలో మంత్రుల సభ జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మండల పరిధిలోని ఎల్లంపల్లి వద్ద గల కస్తూర్బా గాంధీ విద్యాలయంను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు, ఆర్ డీఓ గంగయ్య, తహశీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎల్లంపల్లి డీఈ శరత్‌బాబు, ఎంపీ డీఓ వేణు మాధవ్, నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, పూదరి సత్తయ్యగౌడ్, సింగం కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్నదాతలకు అందుబాటులో ఉంటాం

మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న



బాధ్యతలు స్వీకరించిన మంథని ఏఎంసీ పాలకవర్గం

మంథని, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని మంథని, ముత్తారం, మల్హర్ మండాల్లోని అన్నదాతలకు పాలకవర్గం నిరంతరం అందుబాటులో ఉంటామని మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న స్పష్టం చేశారు. స్థానిక ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్‌గా కుడుదుల వెంకన్న, వైస్ చైర్మన్‌గా ముస్కుల ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్లుగా రావికంటి వెంకటేష్, ఎల్లంకి శంకంర్‌లింగం, మంథని సదానందం, కన్నబోయిన ఓదెలు, ఎండీ అంకూస్, రేగళ్ళ రాంమోహన్‌రావు, ఊదరి శంకర్, గడ్డం పోచయ్య, అజ్మీరా చంద్రునాయక్, పన్నాల ఓదెలు, దూలం సులోచన, లింగంపల్లి నర్సింగరావులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శశిభూషణ్ కాచే,పెండ్రి సురేష్‌రెడ్డి, ఐలి ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఓదెల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

● కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న వైనాల రాజు

కమాన్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతాంగ సమస్యలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో తీరుస్తానని కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, డైరెక్టర్లు గుమ్మడి వెంకన్న, రఫీక్, గట్టయ్య, ప్రవీణ్ కుమార్, పుల్లెల సతీష్, ఆర్‌ఎల్ శ్రీనివాస్, ముసుగుల సురేందర్ రెడ్డి, జాగిరి సమ్మయ్య, సిద్ద మురళీకృష్ణ, బుచ్చారావు, గుండా భాస్కర్, సురభి జగన్ మోహన్‌రావు, ఇనగంటి భాస్కర్ రావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి , మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, తొట్ల తిరుపతి, సాన రామకృష్ణ, రమణ కుమార్ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ సాధనలో రెవా కృషి అభినందనీయం

జ్యోతినగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): హయ్యర్ పెన్షన్ సాధించడంలో రామగుండం ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(రెవా) నాయకులు చేసిన కృషి అభినందనీయమని ప్రాజెక్టు మాజీ ఉద్యోగులు అన్నారు. బుధవారం ఎన్టీపీసీలో జరిగిన కార్యక్రమంలో హయ్యర్ పెన్షన్ కోసం పోరాటం చేసిన రెవా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాంకిషన్, నట్టు ముత్యాలుతోపాటు కమిటీ నాయకుల తిరుమల సరేందర్‌గౌడ్, దుర్గం నర్సయ్యపోచయ్య, లాలయ్య, ఎడెల్లి వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు.

ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన డీఆర్‌పీ బృందం

ముత్తారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని ప్రాథమిక పాఠశాలలను డీఆర్‌పీ బృందం సందర్శించారు. మండలంలోని ముత్తారం, పారుపల్లి, శాలగుండ్లపల్లి, అడవిశ్రీరాంపూర్, ఓడేడు, ఖమ్మంపల్లి, సీతంపేట, ఇప్పలపల్లి, సంద్రెల్లి, జిల్లెపల్లి గ్రామాలల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు.

పోలీసులపై కలెక్టరుకు ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటకు చెందిన ఎరుకొండ వినోద్‌ను సుల్తానాబాద్ సీఐ, ఎస్‌ఐ అకారణంగా కొట్టారని అతని తల్లి ఏరుకొండ సరోజన బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో కుటుంబీకులతో కలిసి వివరాలు వెల్లడించారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



పాలకుర్తిలో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేలా వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, రామగుండం పట్టణంలో రూ.4కోట్లతో ప్రభుత్వ పాఠశాలను ఆధునికీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ప్రజాపాఠశాలను కేసీ పుల్లయ్య ట్రస్ట్ దత్తత తీసుకుని కేసీ పుల్లయ్య విద్యాలయంగా ఏర్పాటు చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్య ఖరీదుగా మారిందని, హైదరాబాద్ వంటి నగరాల్లో పాఠశాల విద్యకే ఏటా ఐదారు లక్షలు ఫీజులు ఉంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ప్రారంభిస్తుందని, రామగుండంలో రూ.220కోట్లతో పాఠశాలను నెలకొల్పుతున్నారన్నారు. రామగుండం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. కేసీ పుల్లయ్య ట్రస్ట్ విద్య, వైద్య రంగాల్లో ఎంతో సేవలందిస్తుందని, ఆ ట్రస్ట్ ప్రజాపాఠశాలను దత్తత తీసుకుని డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కేసీ పుల్లయ్య ట్రస్ట్ సెక్రటరీ కే అనీల్ కుమార్, సీఈఓ సుధారాణి, డైరెక్టర్ ఫణి, ప్రజాపాఠశాల ట్రస్ట్ నుంచి జేవీ చలపతిరావు, బొజ్జ బిక్షమయ్య, పాఠశాల సిబ్బంది, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మండలం పరిధిలోని అల్ట్రాటెక్ వర్కర్స్ క్లబ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 3న అంతర్గాం మండలంలో జరిగే మంత్రుల సభను కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్,కన్నాల పీఎసీఎస్ చైర్మెన్ బయ్యపు మనోహర్ రెడ్డి,డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య,నాయకులు పర్శవేణి శ్రీనివాస్,పాత రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలుర కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నేడు

సుల్తానాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ 2025-26 మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మిగిలిన ఖాళీల భర్తీ చేయడం కోసం గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షీటీమ్ అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు షీటీమ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ మెంబర్ స్నేహలత, సభ్యులు మౌనిక, సురేష్, హెడ్‌మాస్టర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బితం జలపాతానికి నిధుల కేటాయింపుపై హర్షం

పెద్దపల్లి రూరల్ , జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సబ్బితం గౌరిగుండాల జలపాతాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి రూ.6 కోట్లు నిధులు కేటాయించడంపై బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును సబ్బితం కాంగ్రెస్ శాఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ చంద శంకర్, కందుల అశోక్, గ్రామశాఖ అధ్యక్షులు కీర్తి హరీష్, గుమ్మడి ప్రసాద్, కల్లెపల్లి కిష్టయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కోల్‌సిటీటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్వాడీ టీచర్లకు గౌరవ వేతనంగా రూ.18,000 చెల్లించాలన్నారు.

ఖనిలో రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు



ఖనిలో కృత్రిమ అవయవాలు అందిస్తున్న కోదండరాం

కోల్‌సిటీటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు 320జీ లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం హాజరై మాట్లాడారు. స్థానిక లయన్స్ భవన్‌లో 35 మందికి కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుర్తింపుకార్డులు అందజేసి స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో మొక్కలు నాటారు. అనంతరం లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ బాబురావు ఘట్టమనేని జన్మదినం సందర్భంగా మీల్స్ ఆన్ వీల్స్ అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు పోకల ఆంజనేయులు, కార్యదర్శి ముదు తనపెల్లి సారయ్య, కోశాధికారి రాజేంద్రకుమార్, మాజీ డిస్ట్రిక్ గవర్నర్ ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ కజాంపురం రాజేందర్, జోన్ చైర్మన్ పి.మల్లిఖార్జున్, సీనియర్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, తిలక్‌చక్రవర్తి, గుండా వీరేశం, లక్ష్మారెడ్డి, మనోజ్‌కుమార్, బేణి గోపాల్ త్రివేది, గుండరాజు, తానిపర్తి విజయలక్ష్మి, ఆకుతోట సత్యనారాయణ, రంగమ్మ, ఎల్.రమణారెడ్డి, బి.కౌలస్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గౌస్

గోదావరిఖని, జూలై 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న చెత్త సేకరణ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్ డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న చెత్త సేకరణ కార్మికులకు వర్షాకాలంలో రెయిన్ కోట్స్, చేతులకు గ్లౌజులు, మాస్కులు, డెట్టాల్ లోషన్, సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, టవల్స్ ఇవ్వాల్సి ఉండగా చాలా కాలం నుంచి ఇవ్వడం లేదని, వీరికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే వారికి రక్షణ వస్తువులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కార్పొరేషన్‌కు ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులను డిమాండ్ చేశారు. ప్రతి డివిజన్‌లో ఇంటింటికి చెత్త సేకరణ చేసే కార్మికులకు అదనంగా రోడ్లను ఊడవడం, చెత్త బండ్లపై వెళ్లడం, కాలువలు, ఇతర పనులు అధికారులు చెప్పడం వల్ల వారు అధిక పని భారం వల్ల తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా చెత్త సేకరణ చేసే కార్మికులకు వేతనాలు అతి తక్కువగా ఇవ్వడం వల్ల పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వారికి ఇచ్చే వేతనాలు సరిపోవడం లేదని ఆయన అన్నారు. కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లలో పని చేస్తున్న కార్మికులను మార్చకుండా యధావిధిగా కొనసాగించాలని, వారిని మానసిక వేధింపులకు గురిచేయకుండా సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యాచరణలో విద్యార్థుల భాగస్వామ్యం

కోల్‌సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వంద రోజుల పారిశుధ్య కార్యాచరణలో విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. ఇప్పటికే ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు బుధవారం వంద ఆకారంలో నిలిచి మద్దతు పలికారు. గోదావరిఖని సప్తగిరి కాలనీలోని జ్యోతిబాపూలే బీసీ బాలుర పాఠశాల విద్యార్థులు కార్యాచరణలో పాల్గొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని అశోక్‌నగర్, గాంధీనగర్‌లలోని నాలాల్లో సిబ్బంది పూడిక తీత చేపట్టారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఆర్ఐ శంకర్‌రావు, ఎస్‌ఐలు నాగభూషణం, కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా అన్వర్

కమాన్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎస్ఎస్ అన్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. మండల కేంద్రానికి చెందిన అన్వర్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ బుధవారం ఈ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

ధర్మారం: ధర్మారం మండలంలోని బీఆర్ఎస్ సర్పంచులు, నాయుకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం ఎండపల్లి మండలం రాజరాంపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ధర్మారం నుంచి రాజారాంపల్లి వరకు బైక్ ర్యాలీ తీశారు. కొత్తూర్ మాజీ సర్పంచ్ తాళ్లపెల్లి మల్లేశం గైడ్, సాయంపేట మాజీ సర్పంచ్ చెనెల్లి సాయి, బుచ్చయ్యపల్లి సర్పంచ్ ఇమ్మడిశెట్టి కొమురయ్య, పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరారు.

కుర్మపల్లి బస్‌షెల్టర్ కూల్చివేత

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కార్యదర్శి

పెద్దపల్లి రూరల్ , జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుర్మపల్లి గ్రామ ఆర్‌టిసి బస్‌షెల్టర్‌ను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూల్చివేయడంతో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత పెద్దపల్లి రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పనులు ఆపమని చెప్పినందుకు అక్కడే ఉన్న మరో వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడని , దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై, కూల్చివేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



పోతనకాలనీలో యోగా కేంద్రం ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహాకవి పోతన కాలనీలో యోగా కేంద్రాన్ని బుధవారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఉద్యోగులు వారి కుంబ సభ్యుల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఆధునీకరించిన యోగా కేంద్రం పోతనకాలనీ వాసులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యోగులతో పాటు మహిళలు, చిన్నారులు యోగ సాధన చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి అసిసెకటంట్ సెక్రెటరీ శ్యాంసన్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీవైఎస్ఈ వినయ్‌సాగర్, ఈఈ ప్రతాపగిరి రాజు, ఎస్ఎస్‌ఓ షరీఫ్ మహమ్మద్, పోతనకాలనీవాసులు పాల్గొన్నారు.

గైర్హాజరీ ఉద్యోగులకు కౌన్సెలింగ్



ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు యాజమాన్యం బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించింది. 2024లో 100 మస్టర్ల కంటే తక్కువ జూన్ 2025లో 50 మస్టర్ల కంటే తక్కువ హాజరు ఉన్న ఉద్యోగులకు అధికారులు సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరీతో వేతనం నష్టపోవడమే గాక, గని ఉత్పత్తి లక్షానికి ఆటంకం ఏర్పడుతుందని జీఎం బండి వెంకటయ్య తెలిపారు. విధులు సక్రమంగా చేయకపోతే కలిగే అనర్థాలను వివరించారు. గైర్హాజరీకి గల కారణాలను తెలుసుకుని, సలహాలు, సూచనలు చేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. విధులకు సక్రమంగా హాజరయ్యే ఉద్యోగులకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని జీఎం తెలిపారు. గతంలో మాదిరి కష్టమైన పనులు ప్రస్తుతం సింగరేణిలో లేవని, ప్రతి ఉద్యోగి హాజరు శాతాన్ని పెంచుకుని సంస్థ అభివృద్ధిలో భాగస్వామికావాలని జీఎం సూచించారు. ప్రతి ఉద్యోగి నెలలో 22 మస్టర్లు విధిగా పూర్తి చేయాలని జీఎం వెంకటయ్య సూచించారు. కౌన్సిలింగ్‌లో ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, మెడికల్ సూపరెండెంట్ డా.మహిపాల్, డీవైపీఎం వంశీధర్, సీనియర్ పర్సనల్ మేనేజర్ సాధన్, వెల్ఫేర్ ఆఫీసర్లు సాయికృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

రామగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలోని ఎస్సీకాలనీలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుమన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్, ఆల్‌ఇండియా అంబేద్కర్ సంఘం నాయకుడు బూడిద సమ్మయ్య, రామగిరి రమేశ్, కానిస్టేబుల్ లకాన్, కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలు

కమాన్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి జయంతి ఉత్సవాలు ఆగష్టు 5నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ఓఈ కాంతారెడ్డి, ప్రధాన అర్చకులు కల్వకుంట్ల వరప్రసాదాచార్యులు తెలిపారు.

విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ అవసరం

ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువుతో పాటు స్వీయ క్రమశిక్షణ అవసరమని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. బుధవారం స్థానిక సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన క్యాబినెట్ కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ఈడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సచ్‌దేవ స్కూల్ విద్యార్థుల క్యాబి నెట్ కమిటీ ఎంపిక జరిగింది. గంగ, గోదావరి, కృష్ణా, బ్రహ్మపుత్ర అనే గ్రూపులుగా విభజించి పోటీ నిర్వహించారు. పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థుతో క్యాబినెట్ కమిటీ సభ్యులుగా స్కూల్ ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చందన్ ప్రమాణ స్వీకారం చేయించారు. పీటీఎస్‌లోని జ్యోతిక క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు ప్రవీణ్ కె చౌదరి, రవి సబావత్, కెవి ఎంకె.శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి వాహనాలను అడ్డుకున్న అక్కెపల్లి నిర్వాసితులు

మంథనిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెపల్లి సింగరేణి భూనిర్వాసితులు బుధవారం సింగరేణి వాహనాలను అడ్డుకొని నిరసన తెలిపారు. సింగరేణి సంస్థ ఓసీపీ-2 విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న 39 మంది నిర్వాసితులకు తక్కువ నష్టపరిహారం వచ్చిందని కోర్టు ఆశ్రయించారు. విచారణ చేసిన కోర్టు ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు వందశాతం నష్టపరిహారం ఇవ్వాలని తీర్పునివ్వగా నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించలేదు. గ్రామంలోని ఇండ్లను కూల్చివేయటానికి సింగరేణి వాహనాలు రాగా గ్రామస్థులు అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామంలో సింగరేణి వారు ఇండ్లు తొలగించేటప్పుడు రూ. 30 వేలు ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్అండ్ఆర్ సగం ప్యాకేజీ ఎలాంటి షరతులు లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టులో ఉద్యోగులకు యాజమాన్యం బుధవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో ఏరియా పర్యావరణ అధికారి కిషన్ మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నదని, ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిచేలా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ప్రభావిత ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఉద్యోగి విధిగా మొక్కలు పెంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో బేస్‌వర్క్‌షాప్ హెచ్ఓడీ సత్యనారాయణ, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు శ్రీనివాస్, జక్కుల దామోదర్‌రావు, బుగ్గాజీ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సాధారణ మరణాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

గోదావరిఖని, జూలై 30(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సాధారణ మరణాలు, వివిధ జబ్బులతో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ సింగరేణి యాజమాన్యంకు లేఖ రాసి చర్చించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మిర్యాల రాజిరెడ్డికి పదోన్నతి



రామగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధి లోని ఓసిపి-1లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన మిర్యాల రాజిరెడ్డి మార్చి 9న సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్గత రాత పరీక్షలో ఉత్తీర్ణత పొంది జూనియర్ ఆఫీసర్ ఈ-1 గ్రేడ్ అధికారిగా పదోన్నతి పొందారు. బుధవారం సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి కాగా ఎస్సీడబ్ల్యూ కార్మికునిగా ఉన్న రాజిరెడ్డి అధికారిగా పదోన్నతి పొందారు. రాజిరెడ్డి పదోన్నతిపై పలు కార్మిక సంఘాలు నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.